క్లుప్తంగా

చెట్లకు నిప్పు పెడుతున్న దుండగులు



నిజాంసాగర్(జుక్కల్) : ప్రధాన రహదారులతో పాటు పంట చేనుగట్లపై ఉన్న పచ్చని చెట్లు రోజు, రోజుకు అంతరిస్తున్నాయి. పచ్చని చెట్లకు నిప్పు పెట్టడంతో పాటు గొడ్డలి వేటుకు గురిచేస్తూ అక్రమ కలప రవాణా చేస్తున్నారు. శుక్రవారం వేకువజామున మహమ్మద్ నగర్ మండలంలోని గున్కుల్ శివారులో ప్రధాన రోడ్డు ప్రక్కన ఉన్న భారీ వృక్షానికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో అది నేలకూలింది. గ్రామ శివారు ప్రాంతాలతో పాటు ప్రధాన రహదారులు, అటవీ ప్రాంతాల్లోని చెట్లను నరికి ఇటుక బట్టీలకు కలపను తరలిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు పాటించాలి



నిజాంసాగర్(జుక్కల్): వానాకాలం పంటల సాగుకు అవసరమైన విత్తనాల ఎంపిక, కొనుగోళ్ల విషయంలో రైతులు జాగ్రత్తగా ఉండాలని క్లస్టర్ ఎఈవో మదుసూదన్ అన్నారు. శుక్రవారం మహమ్మద్ నగర్ మండలంలోని బూర్గుల్ గ్రామంలో విత్తనాల ఎంపికపై రైతులకు అవగాహన కల్పించారు. బిల్లు రసీదును తప్పని సరిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు నాయకులు గజ్జెల విజయ్‌కుమర్, భాస్కర్‌రెడ్డి, అబ్జల్ తదితరులు ఉన్నారు.

తాడ్వాయి ఐకేపీలో ఆడిట్



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో శుక్రవారం ఆడిట్ అధికారులు ఆడిట్ నిర్వహించారు. 2023-2024కు గాను సంబంధించి ఆర్థిక లావాదేవీలపై ఆడిట్ చేశారు. చార్టెడ్ అకౌంటెంట్‌తో పాటు మండల సమాఖ్య, అన్ని వీవోఏల ఖర్చుల లావాదేవీలపై వార్షిక ఆడిట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆడిట్ అధికారి కృష్ణారెడ్డి, ఏపీఎం రవీందర్, అకౌంటెంట్ తిరుపతిరెడ్డి, సీసీలు, వీవోఏలు, ఆడిట్ టీం పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన



నిజాంసాగర్(జుక్కల్) : మహమ్మద్ నగర్ మండలంలోని బూర్గుల్, కొమలంచ గ్రామాల్లోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం బాన్సువాడ ఆర్డీవో రాథోడ్ రమేశ్ పరిశీలించారు. వరిధాన్యం కొనుగోలు, ధాన్యం బస్తాల తరలింపు వేగం చేశామని ఆర్డీవో చెప్పారు. ఆయన వెంట స్థానిక తహశీల్దార్ క్రాంతికుమార్, సొసైటీ సిబ్బంది ఉన్నారు.

సిద్ధరామేశ్వరాలయంలో వాస్తు గణపతి హోమం



భిక్కనూరు : భిక్కనూరు సిద్ధరామేశ్వరాలయంలో ఉడిపి వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేదపారాయణ, హోమ కార్యక్రమాలు నాలుగు రోజులుగా ఘనంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం శాస్త్రోక్తంగా వేద పారాయణం, గణపతి వాస్తు హోమం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో చిత్రీకరించిన గణపతి, నాగపాము ప్రతిమలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది రాంరెడ్డి-కృష్ణకుమారి దంపతులు ఆలయ ఈవో శ్రీధర్, ఆలయ పునర్ నిర్మాణ కమిటీ చైర్మన్ అందే మహేందర్‌రెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మన్ టిపి.లింబాద్రి, భక్త కమిటీ ప్రతినిదులు అందే దయాకర్‌రెడ్డి, మైపాల్‌రెడ్డి తదితరులున్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం

పిట్లం(జుక్కల్): పిట్లం మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం లయన్స్ క్లబ్ శాఖ కంటి వైద్య శిభిరాన్ని నిర్వహించారు. ఈ శిభిరంలో కంటి వైద్య నిపుణులు హరికిషన్ రావు 75 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు కిషన్, సభ్యులు కాశీరెడ్డి, సంతోష్, వైద్యులు శివ కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా రథోత్సవం

- లక్ష్మీనారాయణ ఆలయంలో రథం ఊరేగింపు
- ఉత్కంఠగా సాగిన కుస్తీ పోటీలు



కుస్తీ పోటీలను తిలకిస్తున్న మాజీ ఎమ్మెల్యే సింధే



మద్నూర్‌లో రథాన్ని ఊరేగిస్తున్న గ్రామస్తులు

మద్నూర్(జుక్కల్) : గత రెండు రోజుల నుండి కొనసాగుతున్న రథోత్సవ కార్యక్రమాలు మద్నూర్‌లో శుక్రవారం ముగిశాయి. మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా గ్రామస్తులు రథాన్ని ఊరేగించారు. మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనారాయణ ఆలయంలో రథపౌర్ణమి సందర్భంగా రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. యువకులు, గ్రామస్తులు రథాన్ని లాగుతూ లక్ష్మీ రమణ గోవింద... వెంకట రమణ గోవింద అంటు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. రథోత్సవాల్లో చుట్టుముట్టు ఉన్న గ్రామాల నుండి వచ్చిన భక్తుల కోసం అన్నదానం, భజన, కీర్తన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. రథానికి అందంగా రంగులు దిద్ది, రంగు రంగుల విద్యుత్ దీపాలతో రెండు రోజుల పాటు ఊరేగింపు నిర్వహించారు. రథసారధులు రథంపై అనవాయితీ ప్రకారం కాగడాలను పెట్టారు. చిన్నాపెద్ద తేడా లేకుండా రథోత్సవ కార్యక్రమానికి గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. శ్రీరాముడు, హనుమాన్‌ల భారీ విగ్రహాలతో ఊరేగింపు కొనసాగింది. యువకులు, చిన్నారులు డ్యాన్సులు చేస్తూ ఘనంగా ఉత్సవాన్ని నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా జాతర ఏర్పాటైంది. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే హాజరయ్యారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తెలంగాణ, మహారాష్ట్ర నుంచి..

మండల కేంద్రానికి సమీపంలో నిర్వహించిన కుస్తీ పోటీలు ఉత్కంఠ భరితంగా సాగాయి. ఆలయ కమిటీ అతిథులను శాలువాలతో సత్కరించారు. మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనారాయణ ఆలయంలో రథోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కుస్తీ పోటీల్లో తెలంగాణ, మహారాష్ట్ర ప్రాంతాల నుండి మల్లయోధులు తరలివచ్చి కుస్తీ పోటిల్లో పాల్గొన్నారు. ఉదయం నుండి సాయంత్రం వరకు కొనసాగిన కుస్తీ పోటీలను తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు భారీగా తరలివచ్చారు. రూ. 100, నుంచి రూ. 5వేల వరకు కుస్తీ పోటీల్లో గెలిచిన వారికి గ్రామ పెద్దలు నగదును అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.



కుస్తీ పడుతున్న మల్లయోధులు

కమిటీలు సక్రమంగా పనిచేయాలి



మాట్లాడుతున్న ఏపీఎం రవీందర్

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : అమ్మ ఆదర్శపాఠశాల కమిటీల సభ్యులు సక్రమంగా పనిచేయాలని ఐకేపీ ఏపీఎం రవీందర్ అన్నారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో శుక్రవారం మండల సమాఖ్య అధ్యక్షురాలు యశోద అధ్యక్షతన మండల సమాఖ్య సమావేశాన్ని నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న శ్రీనిధి, బ్యాంకు లింకేజీ రుణాలు సక్రమంగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతినెలా 10వ తేదీలోపు చెల్లించిన సంఘాలకు మాత్రమే పావులా వడ్డీ వర్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య సభ్యులు, సీసీలు, వివిధ గ్రామాల అధ్యక్షురాలు, సిబ్బంది పాల్గొన్నారు.

విత్తనాల స్టాక్ తనిఖీ



రామారెడ్డి : సదాశివనగర్ మండల కేంద్రంతో పాటు పద్మాజీవాడి, ఉత్తునూర్ గ్రామాల్లో సొసైటీ ఫర్టిలైజర్లలో విత్తనాల స్టాక్‌ను శనివారం మండల వ్యవసాయ అధికారి ప్రజాపతి తనిఖీ చేశారు. రైతులకు ఎరువులు ఆధార్ కార్డ్ ఆన్‌లైన్ నమోదుతోనే విక్రయించాలన్నారు. ఎరువులను అమ్మే సమయంలో రిజిస్టర్‌లో రైతుల వివరాలు నమోదు చేయాలని సూచించారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని భవిత సెంటర్‌లో శుక్రవారం దివ్యాంగుల చిన్నారులకు వైద్య నిపుణుడు సాయికిరణ్‌గౌడ్ ఫిజియోథెరపీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్‌పీలు శ్యామల, అశ్విని, ఆశ వర్కర్లు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని తయారు చేయాలి



ప్లాస్టిక్ కవర్లపై అవగాహన కల్పిస్తున్న కమిషనర్

ఎల్లారెడ్డి : పర్యావరణానికి ముప్పు కల్పించే ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించి ఎల్లారెడ్డి పట్టణాన్ని ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా మార్చేందుకు ప్రజలందరూ సహకరించాలని ఎల్లారెడ్డి మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కవర్ల వాడకాన్ని నిషేధించాలంటూ పట్టణంలో శుక్రవారం మున్సిపల్ సిబ్బంది వ్యాపారస్తులకు అవగాహన కల్పించారు. దుకాణాలలో హోటళ్లలో తనిఖీలు చేసి ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. జనుపనారతో చేసిన కవర్లను వాడాలని మున్సిపల్ సిబ్బంది వ్యాపారస్తులను కోరారు. ప్లాస్టిక్ కవర్లు వాడితే జరిమానా విధిస్తామన్నారు.

సైబర్ మోసగాళ్లతో జాగ్రత్త



భిక్కనూరు : సైబర్ మోసాగాళ్లు రోజురోజుకు కొత్త పద్ధతులతో మోసాలకు పాల్పడుతున్నారని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సాయికుమార్ అన్నారు. శుక్రవారం భిక్కనూరు మండల కేంద్రంలో పోలస్ కళాజాత బృందం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈత పూర్తిగా వస్తేనే చెరువుల్లో కుంటల్లోకి ఈతకు వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కళాబృందం సభ్యులు ప్రభాకర్,సాయిలు, శేషారావు, భూమయ్య, రాజేందర్‌లు పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళాలు



బాన్సువాడ : బాన్సువాడ అయ్యప్ప ఆలయం వద్ద నిత్య అన్నదానం కోసం భక్తులు భారీగా విరాళాలు ఇస్తున్నారు. బీర్కూర్‌కు చెందిన వ్యాపారవేత్త సంతోష్ గుప్త రూ. 51 వేలు, గురుస్వామి గుడికొండ లింగం రూ. 25 వేలు, కొట్టూరి దత్తు రూ. 25 వేల నగదును విరాళంగా అయ్యప్ప సేవ సమితి వ్యవస్థాపకులు బెజుగం శంకర్ గురుస్వామికి అందజేశారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప సేవ సమితి సభ్యులు ర్యాల విఠల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మికం

ఘనంగా బద్ది పోచమ్మ ఆలయ వార్షికోత్సవం



రామారెడ్డి : సదాశివనగర్ మండలం అడ్లూరు ఎల్లారెడ్డిలోని గ్రామ బద్ది పోచమ్మ 13వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 3 గంటలకు గౌరి గణపతి పూజ పుణ్యాహవచనం, ధూపదీప నైవేద్యం సమర్పించారు. శాంతి కల్యాణం, ఒడి బియ్యం, బోనాలు కార్యక్రమాలు నిర్వహించారు.

శబరిమాత ఆశ్రమంలో పల్లకీ సేవ




తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని శబరి మాత ఆశ్రమంలో శుక్రవారం భక్తులు పల్లకీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. శబరిమాత చిత్రపటం, పాదుకలను పల్లకీలో ఉంచి ఆశ్రమం ఆవరణలో భక్తిశ్రద్ధలతో పల్లకీసేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నదానం చేశారు. సూర్యం, రాజాగౌడ్, సిద్దిరాములు తదితరులున్నారు.

ఘనంగా ఎడ్లబండ్ల ప్రదర్శన



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని అయిలాపూర్ గ్రామంలో దుర్గమ్మ ఆలయం వద్ద శుక్రవారం గ్రామస్తులు ఎడ్లబండ్ల ప్రదర్శన అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా డప్పువాయిద్యాలతో ఎడ్లబండ్లను ఊరేగించి దుర్గమ్మ ఆలయం చుట్టు ఐదు సార్లు ప్రదక్షిణ చేసి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి భజన నిర్వహించారు. ఆలయం వద్ద శనివారం తెల్లవారు జామున రథోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఆలయ మహాకుంభ సంప్రోక్షణ..



మాచారెడ్డి : మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా శుక్రవారం ఆలయాన్ని మహా కుంభ, శిఖర ప్రోక్షణ చేశారు. చక్రతీర్థోత్సవం, మేళ తాళాలతో స్వామి వారి ఊరేగింపును కన్నుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కమలాకర్ రెడ్డి, ఈవో శ్రీధర్ రావు, సిబ్బంది అర్చకులు ఉన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనాలి



మాట్లాడుతున్న ఎంపీపీ కానుగంటి శారద

దోమకొండ : తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేయాలని కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ఎంపీపీ కానుగంటి శారద జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్ అధికారులకు సూచించారు. అదేవిధంగా ఇటీవల కురిసిన అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా సేకరించాలని సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కానుగంటి శారద అధ్యక్షతన నిర్వహించిన సాధారణ సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడారు. ధాన్యం తరలింపునకు అవసరమైన లారీలను కొనుగోలు కేంద్రాల వద్ద అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. మరో 3 రోజుల్లో పూర్తిస్థాయిలో ధాన్యం సేకరణ పూర్తవుతుందని తహసీల్దార్ తెలిపారు. విద్యుత్ పోల్స్‌ని మరమ్మతులు చేసి పాడైన వాటిని సరిచేయాలని సభ్యులు ఏఈకి సూచించారు. బురుజు వద్ద కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని ఎంపీపీ సూచించారు. అధికారుల సూచన మేరకే విత్తనాలు కొనాలని ఏవో తెలిపారు. జీలు, జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. తాగునీటికి ఇబ్బంది లేకుండా చూస్తున్నామని ఎంపీడీవో రమేశ్ తెలిపారు. సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ కానుగంటి శారద, వైస్ ఎంపీపీ బాపురెడ్డి, తహసీల్దార్ సంజయ్ రావు, ఎంపివో తిరుపతి రెడ్డి , ఎంపీటీసీలు, అధికారులు తదితరులున్నారు.

గ్రామ సంఘాల ఆడిట్



భిక్కనూరు : మండల కేంద్రంలోని మహిళ సమాఖ్య భవనంలో గ్రామ సంఘాల పుస్తకాలను, రికార్డులను కరీంనగర్ జిల్లాకు చెందిన చార్టెడ్ అకౌంటెంట్ బృందం సభ్యులు శుక్రవారం ఆడిటింగ్ నిర్వహించారు. గత ఏడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి 31వ తేది వరకు నిర్వహించిన లావాదేవీలకు సంబంధించిన వివరాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆడిట్ సభ్యులు రవి రాజు, కిరణ్, పవన్, ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్ మండల సమైఖ్య అధ్యక్షురాలు రాజమణి కార్యదర్శి విజయ, కోశాధికారి గంగ లక్ష్మి, వీవోఏలు కంప్యూటర్ ఆపరేటర్ ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజారోగ్యం, రెవెన్యూ శాఖల వివరాల సేకరణ



రామారెడ్డి : సదాశివనగర్ మండలంలోని పద్మాజీవాడి జీపీలో సెంట్రల్ సెక్రటేరియట్ టీం(ఏఎస్‌వో ట్రైనింగ్) సభ్యులు శనివారం సందర్శించారు. గ్రామంలో 4 రోజులపాటు సందర్శించి వివిధ అభివృద్ధి కార్యక్రమాలను, మౌలిక వసతుల వివరాలను గ్రామస్తుల నుంచి సేకరించారు. హెల్త్ డిపార్ట్మెంట్, రెవెన్యూ డిపార్ట్‌మెంట్ గురించి గ్రామస్తుల నుంచి వివరాలను టీం సభ్యులు సేకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సంతోష్ కుమార్, ఎంపీవో సురేందర్ రెడ్డి, ఏపీవో మధు పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీటీసీల మధ్య వాగ్వాదం



కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎంపీటీసీల వాగ్వాదం

భిక్కనూరు : మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో కాంగ్రెస్ బీఆర్ఎస్ ఎంపీటీసీల వాగ్వాదానికి దిగారు. శుక్రవారం ఎంపీపీ గాలిరెడ్డి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. రామేశ్వర్ పల్లి గ్రామ కాంగ్రెస్ ఎంపీటీసీ సభ్యుడు మద్ది చంద్రకాంత్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ రైతులకు పంట నష్టం ఇవ్వలేదని సీఎం రేవంత్‌రెడ్డి పంట నష్టంను అందజేశాడని ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు చెప్పారు. దీంతో బీఆర్ఎస్ ఎంపీటీసీలు ద్యావర సాయిరెడ్డి, సాయగౌడ్, రామేశ్వర్‌పల్లి విండో చైర్మన్ నాగార్తి భూంరెడ్డిలు అభ్యంతరం తెలిపారు. బీఆర్ఎస్ హయాంలోనే రైతులకు ఎంతో మేలు కల్గిందని కేసీఆర్ రైతు పక్షపాతి అని అన్నారు. దీంతో కాంగ్రెస్ ఎంపీటీసీ సభ్యుడు చంద్రకాంత్‌రెడ్డికి బీఆర్ఎస్ ఎంపీటీసీల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ కలుగజేసుకుని ఎన్నికల కోడ్ అమలులో ఉందని సమావేశంలో వాగ్వాదానికి దిగడం సమంజసం కాదని చెప్పడంతో వాగ్వాదం సద్దుమణిగింది. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ గుడిసె యాదగిరి, డీసీసీబీ డైరెక్టర్ కిష్టగౌడ్, విండో చైర్మన్‌లు గంగ్గుల భూమయ్య,ఎన్గు వెంకట్‌రెడ్డి, వలకొండ వెంకట్‌రెడ్డి, రాజాగౌడ్ తదితరులున్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన



మాట్లాడుతున్న ఎంపీడీవో నాగవర్ధన్

కామారెడ్డి రూరల్ : అమ్మ ఆదర్శ పాఠశాల పథకం నిధులతో ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేస్తున్నట్లు ఎంఈవో ఎల్లయ్య అన్నారు. శుక్రవారం కామారెడ్డి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలో 72 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా ఇప్పటికే 25 శాతం నిధులు అమ్మ అదర్శ పాఠశాల కమిటీ అకౌంట్లలో జమయ్యాయన్నారు. సబ్సిడీపై విత్తనాలున్నాయని ఏవో శ్రీనివాస్ తెలిపారు. ఇందల్‌వాయి నుండి వచ్చిన మిషిన్ భగీరథ నీరు నర్సన్నపల్లి, లింగాయిపల్లి, కోటాల్‌పల్లి, తిమ్మక్‌పల్లిలకు వెళ్లకుండా చిన్నమల్లారెడ్డి మీదుగా ఎందుకు వెళ్తున్నాయని వైస్ ఎంపీపీ ఉరుదొండ నరేష్ మిషన్ భగీరథ ఏఈని ప్రశ్నించారు. తిమ్మక్‌పల్లి చెరువు తూముకు మరమ్మతులు చేయించాలని జీపీ సెక్రటరీ శ్రీనివాస్‌ను వైస్ ఎంపీపీ ఆదేశించారు. లింగాయిపల్లి కొత్త జీపీ భవనానికి మంజూరు వచ్చిందని పీఆర్ ఏఈ ఆదిత్యరెడ్డి తెలిపారు. క్యాసంపల్లి, ముత్యంపేట నుండి దోమకొండ డబుల్ రోడ్డు మంజూరైందని ఆర్అండ్‌బీ డిప్యూటీ ఈఈ శ్రీనివాస్ తెలిపారు. గొర్రెలకు టీకాలు వేయాలని ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు పశువైద్యాధికారిని ఆదేశించారు. నర్సన్నపల్లిలో వైకుంఠదామం గేటు పెట్టించాలని వైస్ ఎంపీపీ నరేష్ అన్నారు. ఎంపీడీవో నాగవర్ధన్ మాట్లాడుతూ వ్యక్తిగత షెడ్లు వేసుకుంటే ఐకేపీ ద్వారా 100 శాతం సబ్సిడీ ఉంటుందన్నారు.

ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు మాట్లాడారు. ఈ సమావేశంలో వైస్ఎంపీపీ ఉరుదొండ నరేష్, ఎంపీడీవో నాగవర్ధన్, ఎంపీవో మలహరి, ఏవో శ్రీనివాస్, ఎంఈవో ఎల్లయ్య, ఆయా గ్రామాల ఎంపీటీసీలు కోరంద భాగ్యలక్ష్మి, కమ్మరి అనంత లక్ష్మి, నీలవ్వ, కో-ఆప్షన్ సభ్యుడు ఫజల్, ఆయా గ్రామాల ప్రత్యేకాధికారులు, గ్రామ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

దొడ్డు వడ్లకూ బోనస్ ఇవ్వాలి



మాట్లాడుతున్న సింగిల్ విండో చైర్మన్లు

భిక్కనూరు : ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి అన్ని రకాల వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ. 500 చెల్లించాలని భిక్కనూరు మండలం రామేశ్వర్‌పల్లి, పెద్దమల్లారెడ్డి, అంతంపల్లి, సింగిల్‌విండో చైర్మన్లు నాగార్తి భూంరెడ్డి, రాజగౌడ్, వలకొండ వెంకట్‌రెడ్డిలు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు భిక్కనూరులో విలేకరులతో మాట్లాడుతూ సన్న రకం వడ్లకు మాత్రమే రూ. 500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడం సరైంది కాదన్నారు.

సంక్షిప్తం

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రామారెడ్డి : రామారెడ్డి మండలం ఉప్పల్‌వాయి గ్రామంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్ ఫస్టియర్‌లో మిగిలిపోయిన ఖాళీలను భర్తీ చేసేందుకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపల్ సత్యనారాయణ కోరారు. ఈనెల 31 లోపు http//trwreir.ac.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. 2024లో పదో తరగతి ఉత్తీర్ణులైన వారు గ్రామీణ ప్రాంతాల్లో తల్లిదండ్రుల ఏడాది ఆదాయం1.50 లక్షలకు మించకుండా, పట్టణ ప్రాంతాల్లో రూ. 2 లక్షల ఆదాయం మించకుండా ఉన్న వారు రూ.100 ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఎస్సీ గురుకులాల్లో..

ఎల్లారెడ్డి రూరల్ : ఎస్సీ గురుకుల సొసైటీ పరిధిలోని నాన్ సీఈవో విద్యాలయాల్లో 2024-25కు గాను ఇంటర్ కోర్సుల్లో మిగిలిపోయిన సీట్లకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎల్లారెడ్డి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ మూర్తి తెలిపారు. పదో తరగతి పాస్ అయిన విద్యార్థులు ఈనెల 24 నుండి 31 వరకు ఎస్సీ గురుకుల సొసైటీ వెబ్సైట్లో ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని ఆయన తెలిపారు.

కేజీబీవీలో..

బాన్సువాడ రూరల్ : మండలంలోని కొత్తాబాది గ్రామంలో ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో 2024-25కు గాను ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశాలకోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ విజయలత తెలిపారు. ఇంగ్లిష్ మీడియంలో ఎంపీసీ, బైపీసీ విభాగాల్లో 40 చొప్పున సీట్లు అందుబాటలో ఖాళీగా ఉన్నాయన్నారు. పదోతరగతి పాసైన విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

29న మండల కోఆప్షన్ మెంబర్ ఎన్నిక

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 29వ తేదీన మండల కోఆప్షన్ మెంబర్‌ను ఎన్నుకున్నట్లు ఎంపీడీవో సయ్యద్‌సాజీద్ అలీ తెలిపారు. ఉదయం 10గంటల లోపు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని, 10 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల్లోపు వరకు నామినేషన్‌ల పరిశీలన, మధ్యాహ్నం 12గంటలకు చెల్లుబాటు అయ్యే నామినేషన్‌ల జాబితా ప్రచురణ ఉంటుందన్నారు. అదే రోజు మధ్యాహ్నం ఒంటిగంట లోపు నామినేషన్ల ఉప సంహరణ, మధ్యాహ్నం ఒంటిగంటలకు కోఆప్షన్‌మెంబరు ఎన్నిక ఉంటుందన్నారు.

పెళ్లిరోజు రక్తదానం చేసిన దంపతులు

కామారెడ్డి అర్బన్ : పెళ్లిరోజు సందర్భంగా సామాజిక సేవ సంకల్పంతో కామారెడ్డి అశోక్‌నగర్‌కు పులారి సుజిత్‌కుమార్, ఉమారాణి దంపతులు శుక్రవారం రక్తదానం చేశారు. ఐదేళ్లుగా సుజిత్‌కుమార్, ఉమారాణిలు రక్తదానం చేస్తున్నారని కామారెడ్డి రక్తదాతల సమూహం వ్యవస్థాపకులు, ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు అభినందించారు.

భవిత పాఠశాలకు వాటర్ ఫిల్టర్ అందజేత

భిక్కనూరు : మండల కేంద్రంలోని భవిత పాఠశాలకు నలుగురు విద్యుత్ వాటర్ ఫిల్టర్‌ను శుక్రవారం బహుకరించారు. బస్వాపూర్ గ్రామానికి చెందిన ముత్తనోల రాజు, ఆంద్యాల ఉమరాణి, భిక్కనూరు గామానికి చెందిన జాగిర్‌సింగ్, కొత్తురి రమేష్‌లు భవిత పాఠశాలలో దివ్యాంగుల కోసం వాటర్ పిల్టర్‌ను బహుకరించారు. వీరికి ఐఆర్పీ మహేందర్ కృతజ్ఞతలు తెలిపారు.